# 15. ఆ రోజులు!

జార్జ్ అప్పుడే దుస్తులు వేసుకోవటం పూర్తిచేశాడు. పెద్ద నిలువుటద్దంలో తన ప్రతిబింబాన్ని చూసుకొని చిరునవ్వు నవ్వాడు.

అతని వెంట్రుకలు తెల్లబడినా – నిజానికి అతనింకా రూపవంతుడనే అనాలి. సన్నగా, పొడుగ్గా, ఉత్సాహకరమైన ముఖంతో – తెల్లబడ్డా అందమైన మీసకట్టుతో – ఒక్క మాటలో – మాటల్లో వెలిబుచ్చలేని అందమేదో అతనిలో ఇంకా మిగిలివుంది. ధనరూపంలో ఇద్దరు మనుష్యులమధ్య ఉండే భేదంకన్నా – లక్షలో ఒక్కరికి మాత్రమే ప్రాప్తించే యీ రూపం చెప్పుకోవాల్సిన విషయమే!

'జార్జ్‌కి ఇంకా మంచిరోజులు లేకపోలేదు' అని గొణుక్కుంటూ డ్రాయింగ్ రూంలో ప్రవేశించాడు. అక్కడ టేబిల్ మీద రాతకోతలకు కావాల్సిన పరికరాలన్నీ సిద్ధంగా, చక్కగా అమర్చబడి ఉన్నవి. చెక్కు చెదరని ఆ అమరికను పట్టిచూస్తే – పరికరాలకు ఎక్కువ పనిఉన్నట్టు తోచదు. టేబిల్‌మీద మూడురకాల వార్తాపత్రికలు, దాదాపు ఒక డజను ఉత్తరాలు ఉన్నవి. జూదరి తన ముందున్న పేక కుప్పను చెరిపేసేవిధంగా, చేతితో ఒక్కసారి నెట్టి బొత్తిగా ఉన్న ఉత్తరాలన్నిటినీ బల్లపరుపుగా బాగా కనిపించేట్టు చేశాడు. పై చిరునామాల దస్తూరిని పరీక్షించాడు. ప్రతి ఉదయమూ కవర్లు చింపబొయ్యేముందు అతను చేసే మామూలు పనుల్లో ఇదొకటి.

ఒక్క క్షణంలో – అతనిలో ఉత్సాహకరమైన ఆవేదనా, దృఢంలేని అనుమానమూ, ఎక్కడో ఎప్పుడో లీలగావున్న జ్ఞాపకమూ ఒకేసారి మెరిసినట్టయినవి. కవర్లలో దాక్కొని సీలుకిందవున్న యీ ఉత్తరాలు ఏ రహస్యాన్ని తనకోసం మోసుకొచ్చినయ్యో? వాటిల్లోని విషయాలు ఏమిటి – శుభవార్తా? సంతోషకరమైన విషయమా? లేక విచారపడాల్సిన వర్తమానమా?...ఒక్క క్షణంలో వాటన్నిటినీ కలయజూచాడు. ఒక్కొక్క దస్తూరినే గుర్తుపడుతూ ఆ కవర్లన్నిటినీ రెండుమూడు రకాలుగా విభజించాడు. వాటిల్లో ఏం

వుంటుందని తను తలుస్తున్నాడో ఆ ప్రకారమే ముందువెనుకలుగా ఒక్కొక్కటే విప్పటం అతనికి అలవాటు...యీ ఉత్తరాలు స్నేహితులు రాసినవి - ఇంకో కుప్పలోవి తను లెక్కచెయ్యని వ్యక్తుల దగ్గర్నుంచి వచ్చినవి....వేరొక బొత్తిలోవి తనకు పరిచయంలేని వ్యక్తులు రాసినవి..యీ చివరిరకం ఉత్తరాలు అతనికి ఆందోళన కలిగిస్తుండేవి. ఆ అపరిచయ వ్యక్తులు తనను కోరేదేమిటి? యీ వంకరటింకర అక్షరాల్లో ఎన్ని వాగ్దానాలు, ఎన్నిరకాల తమాషా ఆలోచనలు, ఎన్నివిధాల భీకరాలు ఇమిడిఉన్నవో!

యీనాడుమాత్రం ఒక ఉత్తరం అతన్ని ఎక్కువగా ఆకర్షించింది. పైకి చూడటానికి విశేషమేమీ ఉన్నట్టు తోచటంలేదుకాని, లోపలివిషయం అగాధమైనదనే ఊహ అతనిలో కలిగింది. అతను ఎందుకోగాని అశాంతితో, భయంతో ఒణికాడు.

అతను ఆలోచనలో పడ్డాడు, 'ఇది ఎవరిదగ్గర్నుంచి వొచ్చి వుంటుంది? యీ దస్తూరి నాకు బాగా తెలుసల్లేవుంది... కాని వెంటనే గుర్తించలేకపోతున్నాను!'

ఆ కవరును సరిగ్గా తన ముఖాని కెదురుగా ఎత్తి పట్టాడు. రెండు వేళ్ళమధ్యా తేలిగ్గా, సున్నితంగా పట్టుకొని - విప్పటమా, మానటమా అనేదాన్ని తేల్చుకోలేక -లోని విషయాన్ని పైనుంచే చదివేందుకు వ్యర్థప్రయత్నం చేశాడు.

తరువాత ఒకసారి వాసన చూశాడు. టేబిల్‌మీదవున్న భూతద్దాన్ని తీశాడు. యీ భూతద్దంతో ఒక్కో దస్తూరిలో వున్న అందమైన వొంపుల్ని పెద్దవిగా చూసి ఆనందించటం అతనికి సరదాగా ఉండేది...వెంటనే అతనికి నరాల బలహీనత్వం ప్రవేశించినట్టయింది.

అతను అనుకున్నాడు : 'ఇది ఎవరి దగ్గర్నుంచి ఐ వుంటుంది? యీ దస్తూరి నాకు పరిచయమైంది....బాగా పరిచయమైనది! అనేకసార్లు ఇదే దస్తూరితో వొచ్చిన కవర్లు తనకు అనేక నూతన వాగ్దానాల్ని తీసుకొని వొచ్చేవి...కాని అదంతా చాలాకాలక్రితం! అందుకనే వెంటనే గుర్తించలేక పోతున్నాను...ఏమో! ఏ పూర్వ పరిచితుడో పైకం అప్పుగా అడుగుతూ రాసిన ఉత్తరమేమో!'

ఇక ఆలోచించి లాభం లేదని ఉత్తరం చించి యీ విధంగా చదువుకున్నాడు.

'ప్రియమిత్రమా!'

ఇప్పటికి మనం ఒకళ్ళ నొకళ్ళం చూసుకొని పావు శతాబ్దం గడిచిపోయి ఉండటంవల్ల నన్ను మరిచిపోయి వుంటావు. అప్పుడు నేను యవ్వనంలో ఉన్నాను. ఇప్పుడు ముసలిదాన్నయ్యాను. సంవత్సరాలక్రితం నేను నా ముసలిభర్తతో అతని ఎస్టేట్లలో స్థిరనివాసానికి గాను పారిస్‌విడిచి వెళ్ళిపోయాను.....నా ముసలిభర్తను 'నీ మందుల ఆస్పత్రి' అని పిలిచేవాడివి - గుర్తుందా? ఆయన ఐదు సంవత్సరాలక్రితం చనిపొయ్యారు. నాకు పద్దెనిమిదేళ్ళ కూతురువుంది. ఆమె చాలా అందమైనది - నువ్వామెను ఇంతవరకూ చూడనేలేదు. ఆమెకు మంచి పెళ్ళిసంబంధాన్ని వెతుకుదామనే

నిశ్చయంతో మళ్ళీ పారిస్ వొచ్చాను. నా కుమార్తెనూ ఆమె వయస్సునూ గూర్చి చెప్పేశాను. యీ సామాన్య విషయాన్ని గూర్చి నువ్వు ఎక్కువగా పట్టించుకోవని నమ్ముతున్నాను.

ఇక నువ్వు - ఎప్పుడూ ఆ రూపవంతుడివైన జార్జ్‌వే! అలా అనే నేను వింటున్నాను. ఇక యీ లూసీ నీ జ్ఞాపకాల నుంచి మాయం కాకుండా ఉంటే ఈ సాయింత్రం వొచ్చి ఆమె ఆతిథ్యాన్ని స్వీకరించు. నీ విషయంలో ఎంతో నమ్మకమైన యీ స్నేహితురాలు - నిన్ను చూడగానే ఉద్రేకంతో తన చేతుల్ని ముందుకుజాచే లూసీ, నీ సాన్నిధ్యంలో తన దురదృష్టాలన్నిటినీ మరిచి చిరునవ్వు నవ్వగలిగే యీ స్నేహితురాలింటికిరా...కాని నన్ను స్నేహపూర్వకంగా కౌగిలించే అవకాశమేకాని, ముద్దుపెట్టుకునే అవకాశం లేదని నా భయం.

- లూసీవాన్సీ

జార్జ్ గుండె దడదడలాడింది. ఆ ఉత్తరాన్ని ఒళ్ళో పెట్టుకొని పడక కుర్చీలోకి కుంగిపొయ్యాడు. అతనిలోని ఊహలన్నీ మనసును కలిచివేసి కన్నీళ్ళకు కారణ మయినయ్.

జీవితంలో అతను ఏ స్త్రీనైనా హృదయపూర్వకంగా ప్రేమించి ఉండగలుగుతే ఆమె 'లూసీవాన్సీ' ఒక్కతే. ఆమె జుట్టులోని తమాషావాసన్నూ, కళ్ళలోని తమాషా బూడిదరంగునూ ఆధారం చేసుకొని, ఆమెను 'సిండర్ పువ్వు' అనే ముద్దుపేరుతో పిలుస్తూండేవాడు. ఆమె ఎంతో అందంగా, ఉత్సాహకరంగా మెరుపుతీగల్లే ఉండేది! వెంట్రుకలు నెరిసిన ఆ లావాటి జమీందారుకు భార్య కావటమే ఆమె దురదృష్టం. ఒకనాడు హఠాత్తుగా ఆ జమీందారు తన భార్యతో సహా ఎక్కడో చాలాదూరాన వున్న తన ఎస్టేట్లలో స్థిరనివాసానికిగాను వెళ్ళాడు. ఆ నాటినుంచీ తను యీర్ష్యకు ఎంతగానో గురయ్యాడు.

నిజమే - తను ఆమెను ప్రేమించాడు - తను హృదయపూర్వకంగా ప్రేమించినట్టు అతి గాఢంగా నమ్మాడు కూడాను. 'జక్యులెట్' అనే ముద్దుపేరుతో ఆమె తనను పిలిచేది...ఆ పేరును ఆమె ఎంత ముద్దుగా, ఉద్రిక్తంగా ఉచ్చరించేది!

చాలాకాలంక్రితం జరిగినవైనా తమ మాధుర్యాల్ని గోల్పోని ఒక వెయ్యి ఊహలు అతని బుర్రలో మెరిసినవి. ఒకనాటి సాయింత్రం ఆమె టీపార్టీ నుంచి వొస్తూ దారిలో తనను పిలిచింది. ఆమె అతి నాజూకుగా అందంగా ముస్తాబై వుంది. ఆ వసంతకాలపు సాయింత్రం తనుకూడా ఆమెతో పార్క్ షికారుకు బయలుదేరాడు..ఆ రాత్రి...ఎంత ఆనందంగా గడిచిపోయింది! చల్లగా, మెల్లిగా, హాయిగా వీచే ఆ గాలిలో ఆమె కొత్త సిల్కు దుస్తులవాసనా, ఆమె ఒంటిమీదినుంచి వొచ్చే సుగంధమూ - కలిసి తనను మత్తెక్కించినవి...తామిద్దరూ కలిసి ఆ బుల్లిసరస్సు దగ్గరకు వొచ్చేప్పటికి ఆమె

ఏడ్వసాగింది...చంద్రుని శీతలకిరణాలు చెట్ల కొమ్మల్లోనుంచి సరస్సులోని నీటిమీద పడుతూ మెరుస్తున్నవి - ఆ అందమైన ప్రకృతి నంతా మరిచిపోయి, ఆశ్చర్యంతో తను కారణం అడిగాడు.

"కారణం నాకే తెలియటంలేదు. యీ నీరూ, ఆ చంద్రుడూ నాలో ఏడవవలసిన భావాల్ని రేకెత్తించి ఉంటాయనుకుంటాను. కవిత్వ పరికరాలైన ప్రకృతి దృశ్యాల్ని చూసినప్పుడు - అవి నా హృదయాన్ని కలచివేస్తవి. ఆ బాధను వొదిలించుకునేందుకు ఇలా ఏడుస్తూంటాను" అని ఆమె జవాబు చెప్పింది.

తను జాలిగాచూస్తూ నవ్వాడు. ఆమె స్త్రీత్వపు ఉద్రేకాన్ని ఎంతో మెచ్చుకున్నాడు. ప్రకృతిలోని ప్రతి చిన్న అందానికీ విపరీతంగా చలించే సున్నిత హృదయంగల ఆ స్త్రీమూర్తిని గట్టిగా కావిలించుకొని - "ఎంత అమాయకురాలివి లూసీ!" అని ముద్దు పెట్టుకున్నాడు.

ఆ ప్రేమగాథ చిన్నదైనా ఎంత విలువైంది! ఎంత సున్నిత హృదయాలమధ్య జరిగిన మధురమైనగాథ! దాన్ని మధ్యలో ఆ జమీందారు వెధవ తుంచిపారేశాడు. తనతో తీసుకొని వెళ్లాక - వాడు ఆమెను మరెవరికీ చూపలేదు కాబోలు!

ఆమె వెళ్ళిపొయ్యాక, ఇతర పనుల తొందర్లో జార్జ్ ఆ గాథను ఎలాగో మరిచిపోగలిగాడు. పారిస్‌లో బ్రహ్మచారిగా బతికేవాడి జీవితంలో - ఒక స్త్రీ ఇంకోస్త్రీని అతి తేలిగ్గా మరిపిస్తూంటుంది. ఐతే మాత్రం -? తన హృదయంలో ఆమె కొక ప్రత్యేకస్థానం శాశ్వతంగా ఉండనే వుంది; ఎందుకంటే ఆమెను ఒక్కతెనే హృదయ పూర్వకంగా ప్రేమించాడు...ఇక ఇప్పుడు ఇందులో అబద్ధమేమీ లేదని గాఢంగా తేలిపోయింది.

చప్పున లేచి నిలబడి ఎవరితోనో చెప్తున్నట్టుగా 'నేను తప్పకుండా ఇవాళ సాయింత్రం ఆమె ఆతిథ్యాన్ని స్వీకరించి తీరుతాను-' అని దూరాన వున్న పెద్ద నిలువుటద్దంముందు నిలబడి, నఖశిఖపర్యంతమూ తన ప్రతిబింబాన్ని చూసుకుంటూ అనుకున్నాడు.

'నేను ఎంత అందవికారంగా, ముసలివాణ్ణయిపొయ్యాను! ఆమె నా కన్నా ముసలిదై, తన పూర్వపురూపాన్నంతట్నీ కోల్పోయివుంటుంది కాబోలు!'

ఏమైనా ఆమె తలచినదానికన్నా సౌందర్యాన్నీ, ఉత్సాహాన్నీ చూపి ఆమెను ఆశ్చర్యపెట్టాలని తలిచాడు. తనను చూడగానే ఆమె ఉద్రేకపూరితురాలై - ఎన్నడో గడిచిపోయిన ఆ రోజుల్ని గూర్చిన విచారంతో కుంగిపోతుంది కాబోలు!

అతను మిగతా ఉత్తరాల్ని కూడా చూశాడు. కాని అవేమీ అంత ముఖ్యమైనవిగా తోచలేదు. ఆ పగలంతా అతని ఆలోచనలన్నీ ఆమెను గూర్చే! ఆమె ఇప్పుడు ఎలా తయారై ఉంటుందో! పాతిక సంవత్సరాలు గడిచిపొయ్యాక, అనుకోకుండా ఇలా

కలవటం ఎంత తమాషాగా ఉంటుంది! తను ఆమెను గుర్తించి - ఆమె తనను గుర్తించలేకపోతుందేమో!

పెళ్ళిచూపులకు వెళ్ళే ఆడదానికన్నా ఎక్కువ శ్రద్ధతో షోగ్గా తయారయ్యాడు. అతిప్రియమైన వ్యక్తుల్ని కలుసుకోబొయ్యే ముందు తను ధరించే ప్రత్యేక దుస్తుల్ని వేసుకున్నాడు. ఆమె చెప్పిన కాలానికి చాలా ముందుగానే వెళ్ళి ఆమెను చూడటంలో తనకుగల కుతూహలాన్ని రూపించాలనే నిశ్చయంతో బయలుదేరాడు.

చక్కగా అమర్చబడ్డ డ్రాయింగ్ రూంలో ప్రవేశించగానే మొట్టమొదట - అతను చూసింది తన ఫొటో. అది తన యవ్వనంలో, తన ఆనందమయ దినాల్లో తీయించుకున్నది. తనలాగే అదికూడా వాడిపోయినట్టు - వెలవెలబోతూవుంది. పురాతన సిల్క్ ఫ్రేంలో అమర్చబడి వాకిలికి ఎదురుగా వేళ్ళాడుతోంది.

అతను కూర్చొని ఆమెకోసం వేచి ఉన్నాడు. అతని వెనుక ఒక తలుపు తెరువబడ్డది. ఆ చప్పుడుకు అతను చప్పున లేచి నిలబడి, వెనక్కు తిరిగాడు. తనకు ఎదురుగా ఒక ముసలామె, నెరిసిన తలకట్టుతో తన రెండు చేతుల్నీ ముందుకు జాచి నిలబడివుంది.

ఆ చేతుల్ని పట్టుకొని, వినయంగా తలవొంచి తెల్లని ఆ చేతులమీద ప్రేమతో అభిమానంతో కూడుకొన్న పెద్ద ముద్దులు పెట్టుకున్నాడు. ఆ తరువాత తల పైకెత్తి తన ప్రేమనంతట్నీ సంపాయించిన ఆమె ముఖంవైపు తేరిపార చూడసాగాడు.

నిజమే - ఆమె ముసలి ఆమె....తను వెంటనే గుర్తించేందుకు వీల్లేనంతగా మారిపోయింది,.. తను చిరునవ్వు నవ్వితే, ఆమె భోరున ఏడుస్తుందేమో నన్నట్టుగా నిలబడి వుందని అతనికి తోచింది.

"లూసీ! నువ్వేనా?" అని గొణగకుండా ఉండలేకపొయ్యాడు.

ఆమె జవాబు చెప్పింది : "ఔను నేనే - నేనే జార్జ్! నన్ను గుర్తించలేక పొయ్యావుకదూ? జీవితంలో ఎక్కువ బాధనూ, దుఃఖాన్నీ అనుభవించాను. ఆ దుఃఖమే నా జీవితాన్ని తినేసింది. నన్ను చూస్తే ఆ విషయం నిజమని నిర్ధారణగా తేలుతుంది-నన్ను చూడకుండా ఉండటమే ఒకందుకు మంచిదేమో కూడాను. కాని నువ్వెంత యువకుడిలాగున్నావు! ఎంత అందంగా ఉండగలిగావు! ఏ నడిబజారు లోనో అనుకోకుండా నిన్ను కలుసుకున్నట్టయితే - ఆనందంతో 'జాక్యులెట్!' అని అరిచేదాన్ని...సరే... కూర్చో. మనం కొంచెంసేపు కాలక్షేపానికి మాట్లాడుకుందాం. తరువాత అమ్మాయిని చూపిస్తాను. ఆమెలో నా పోలికలన్నీ అచ్చుగుద్దినట్టు చూడగలవు - అంతకన్న ఆమె పోలికలన్నీ నాలో అచ్చుగుద్దినట్టు కనిపిస్తవి - అదీకాదు...నా కసలు ఎలా చెప్పాలో తెలియటంలేదు. ఆ రోజుల్లో నేనెలా ఉండేదాన్నో ఆమె ఇప్పుడు అలాగే ఉంటుంది - నువ్వు చూస్తావుగా!... అందుకు ముందు కొంతసేపు నీతో

ఒంటరిగా గడపాలి. నిన్ను మొదట చూడగానే నాలో ఎంతో ఉద్రేకం పొంగిపొరలు తుందనుకున్నాను...సరే... అదంతా గడచిన రోజుల శోభ! పోనీ...దయచేసి కూర్చుంటావా?"

ఆమె పక్కనే కూర్చొని, ఆమె చేతిని తన చేతుల్లోకి తీసుకున్నాడు. ఏం మాట్లాడాలో అతనికి తోచలేదు. తన కసలు ఈమె ఎవరో తెలియనట్టూ ఇది వరకెప్పుడూ ఈమెను చూడనే చూడనట్టూ తోచింది. ఈ ఇంటికి తను ఎందుకు వొచ్చినట్టూ? ఏ విషయాన్ని గూర్చి తను మాట్లాడాలీ? ఆ రోజుల్లో జరిగిన సంఘటనల్ని గూర్చా? తనకూ, ఆమెకూ సంబంధించిన విషయాలు ఇంకేమున్నయ్యనీ? ఈ అమ్మమ్మ ముఖం చూశాక – మధురతమమైన ఆ రోజులే జ్ఞాపకానికి రావటంలేదు. మృదువైన ఆమె హృదయమూ, మెత్తని మాటలూ, మధురమైన చిరునవ్వూ – తన హృదయాన్ని పిండిపారేసే ఆ ఘటనలేవీ గుర్తులేకుండా ఎగిరిపోయినయ్. ఈమెనేనా తను 'సిండర్ పువ్వు!' అని ముద్దుగా పిలిచేవాడు? ఐతే – ఆమె – తన ప్రణయాన్నంతట్నీ ఆకర్షించిన ఆమె – ఆ స్వప్నసుందరి, తనను 'జక్యులెట్' అని మృదువుగా ముద్దుగా తన నరనరమూ జల్లుమనేట్టు పిలిచే ఆమె – యవ్వన రూపంతో మెరిసిపొయ్యే ఆమె – మధురమైన గడిచిన ఆ రోజుల్లోని లూసీ ఏమైందీ?

వారిలో ఏ ఒక్కరూ మాట్లాడలేకపొయ్యారు. ఆ రోజుల్లోని సంఘటనల్ని జ్ఞాపకం తెచ్చుకుంటూ, బాధతో లోలోన కుంగిపోతూ, కదలకుండా శిలాప్రతిమలల్లే కూర్చుండిపొయ్యారు..

ఈ నిశ్శబ్దతను ఆమె భరించలేకపోయింది; లేచి నిలబడి కాలింగ్‌బెల్‌ను నొక్కుతూ "రోజ్‌ను పిలుస్తాను" అంది.

తలుపుమీద కొట్టిన చప్పుడు, తరువాత కొత్తగుడ్డల దుస్తులు కదిలేప్పుడు కలిగే శబ్దం – ఆ తరువాత ఒక యువతి – కనిపించింది. ఆ యువతి అంది "నేను వొచ్చాను అమ్మా!"

హఠాత్తుగా ఒక భూతాన్ని చూసినట్టయి, జార్జ్ అలాగే భయంతో కూడిన ఆశ్చర్యంతో కొయ్యబారిపొయ్యాడు. ఎలాగో చప్పున తెలివి తెచ్చుకొని, "గుడ్‌మార్నింగ్ మాడమ్!" అనగలిగాడు...కాస్త ఆగి ముసలామె వైపు చూసి "ఐతే అచ్చంగా నువ్వేనన్నమాట?" అన్నాడు.

నిజానికి యీ యువతి – తన పూర్వ జీవితగాథలోని మధురమూర్తి లూసీని పోలివుంది. అప్పుడు – సరిగ్గా పాతిక సంవత్సరాల క్రితం మాయమై, మళ్ళీ ఇప్పుడు దర్శనం యిచ్చినట్టయింది. తన హృదయంలో ఏ మూర్తయితే నిలిచి వుందో – ఆమెకూ, యీ యువతికీ భేదం ఆవగింజంతైనా లేదు. కాలచక్రం సంవత్సరాల్ని వెనక్కు నెట్టగలిగిందనిపించింది. కాకపోతే – ఆ మధురమూర్తికన్న వయసులో కొంచెం చిన్న – అంతకన్న ఉత్సాహకరంగా, అల్లరిపిల్ల లక్షణాలతో కనిపిస్తోంది – అంతే!

తన చేతులను జాచి ఆమెను గట్టిగా తన రొమ్ముకు అదుముకొని, మెల్లిగా ఆమె చెవిలో "గుడ్ మార్నింగ్ లూసీ!" అందామనే పిచ్చి కోరికతో అతను ఊగిపొయ్యాడు.

వంటవాడు వొచ్చి "భోజనం సిద్ధంగా ఉన్నదమ్మా!" అన్నాడు. ముగ్గురూలేచి వంటింటి వైపు నడవసాగారు.

భోజనందగ్గర ఏం జరిగిందీ? వాళ్ళు ఏమన్నారూ? వాళ్ళకు తను ఏ విధంగా జవాబులు చెప్పాడూ? అదంతా తనకేమీ తెలియలేదు. ఏదో మధురమైన స్వప్నం తన ముందు సాగిపోతూన్న ట్టనిపించింది. ఆ మాధుర్యం తనను దాదాపు మూగవాణ్ణిగా, పిచ్చివాణ్ణిగా చేసింది. ఆ ఇద్దరు స్త్రీలనూ తదేక దృష్టితో, ఒకర్నొకరు ఖండించుకునే తలపుల బాధతో చూడసాగాడు. అతని మనసును కలిచే సమస్య ఒక్కటి: 'ఇందులో ఎవరు నిజమైన లూసీ? ఎవరు అబద్ధం?'

లూసీ మాటిమాటికీ ఏదో మాట్లాడుతూ "అదంతా నీకు జ్ఞాపకం వుందా జార్జీ?" అని ప్రశ్నిస్తూవుంది... శాంతివంతమైన రోజీ కళ్ళల్లో - ఆ రోజుల్లోని ఆనందాన్ని తను చూడగలుగుతున్నాడు. ఆ జ్ఞాపకాలన్నీ ఎంతో స్పష్టంగా తన ఎదుట జరుగుతూన్నట్టున్నయ్. దాదాపు ఇరవై, ముప్పైసార్లు రోజ్‌తో "నీకు జ్ఞాపకం వుందా లూసీ!" అనేందుకు నోరు తెరిచాడు - అప్పుడు యీ ముసలామె మెత్తని చూపు లన్నిటినీ మరిచి పొయ్యాడు! అసలు కొన్ని క్షణాలు తన మతి పోయినట్టయింది. తను బతికే ఉన్నానా అనే అనుమానానిక్కూడా గురయ్యాడు!... ఒకటి మాత్రం నిజమని తనకు తెలుసు; ఆనాటి యువతి - పావు శతాబ్దం గడిచాక, యీనాడు కూడా అదేవిధంగా, అంత రూపంతోనూ, అంత యవ్వనంతోనూ, అంత ఉత్సాహంతోనూ ఉండటం కల్ల! కాని, యీ రోజ్ తన చూపుల్లోనూ, మాటల ధోరణిలోనూ, కంఠస్వరంలోనూ, ప్రతి కదలికలోనూ - ఆనాటి లూసీని క్షణక్షణానికీ జ్ఞాపకం చేస్తోంది. ఆ పాతజ్ఞాపకాలేవీ లూసీలో కనపడటం లేదు. రోజ్‌లో ఉన్న ఆకర్షణా, తనను మోకరింపజేసిన విశేషమూ - ఏది యీ లూసీలోనుంచి దూసుకుపోయిందో అతనికి అగమ్యగోచరంగా ఉంది.

"ఆ పూర్వపు ఉత్సాహమంతా నీలో మాయమైంది - జార్జ్!" అంది లూసీ.

"దాంతోపాటే ఇంకా అనేకం పోగొట్టుకున్నాను" అని తను గొణిగాడు.

కాని అతని హృదయాంతరాళంలో చచ్చిన స్థితిలోవున్న ఆ ప్రణయవాహినంతా పైకి దూకేందుకు సిద్ధంగా ఉన్నట్టు తోచింది. ఆ ఉద్రేకాలన్నీ అతన్ని ఊపిరికూడా సరిగ్గా పీల్చనివ్వటం లేదు; నిద్రపోతూన్న వన్యమృగాల్ని మేల్కొల్పినట్టయింది.

ఆ యువతి ఏదో మాట్లాడుకు పోతూనే వుంది. మధ్య మధ్య నవ్వుతూ, తామిద్దరివైపూ తన చమత్కారాన్ని చూడమన్నట్టు ఆగుతూ - తల్లి దగ్గర్నుంచి తనకు

అబ్బిన గుణాలెన్నిటినో ప్రదర్శిస్తూనే వుంది. ఇద్దరు ఏళ్ళతరబడిగా కలిసిమెలిసి జీవించటంవల్ల ఒకరి గుణాలు మరొకరికి అబ్బటంలో అబ్బురమేమీలేదు. అదేవిధానంలో రోజ్ మాట్లాడే మాటల ధోరణీ, నవ్వే చిరునవ్వు - క్షణకాలం కాంతివంతమైన కళ్ళతో ఎదుటివ్యక్తిని చూడటమూ - ఇవన్నీ గడిచిన ఆ రోజుల్లోని లూసీని జ్ఞాపకం చేస్తూండటం - జార్జ్‌ని ఆపాదమస్తకమూ ఊపిపారేసినవి. హృదయంలో చెక్కుకట్టి మానుతున్న గాయాన్ని - యీ దృశ్యం తిరిగి రేపి - రక్తప్రవాహాలు పారేట్టుగా చేసినట్టయింది.

అనుకున్నదానికన్న త్వరగా బైటపడి పార్క్‌కు వెళ్ళాడు. కాని యీ యువతి మూర్తి అతని కళ్ళల్లోనే పీఠం వేసింది. అతని హృదయాన్ని పిండి పారేస్తోంది. రక్తనాళాల్లో మిగిలిన వెచ్చని రక్తాన్నంతటినీ పురికొల్పుతూ, అతన్ని వేయివిధాల వేధించ సాగింది. ఆ ఇద్దరు స్త్రీలకూ బదులు అతను ఒక్క స్త్రీమూర్తినే చూడగలుగుతున్నాడు. ఆనాటి లూసీ పోలికలున్న - యీ యువతి రోజ్ - యీమెను ఆ రోజుల్లో లూసీని ప్రేమించనంత గాఢంగానూ, అంత ఉద్రేకంతోనూ ప్రేమిస్తున్నట్టు తోచింది. ఆశ్చర్యపడాల్సిందేమిటంటే - పాతిక సంవత్సరాలు గడిచిపొయ్యాక కూడా - ఆ ప్రణయవాహిని అంత శక్తితోనూ, అంత వేగంతోనూ తనలో ఇంకా పొంగి పొరలటం!

యీ విషయాన్ని గూర్చిన ఆలోచనా భారంతో ఇంటికి వెళ్ళాడు. ఇంత తమాషా, ఇంతఘోరమైన సమస్య తననిలా వేధిస్తుందని కలగన్నాడా?

కాని చేతుల్లో దీపం పట్టుకొని వెళ్తూన్నవాడల్లా పెద్ద నిలువుటద్దం ముందు ఆగిపొయ్యాడు. ముస్తాబై యీ అద్దంలో తన పాపను చూసుకుంటూ, తన అందాన్ని తనే మెచ్చుకుంటూండేవాడు. కాని ఇప్పుడు తను చూసే ప్రతిమ ఒక పెద్దవయస్సువాడు - నెరిసిన తలవెంట్రుకల్తో - అక్కడక్కడ ముడతలుపడుతూన్న ఫాలభాగంతో వుంది. ఎంత ఆశ్చర్యం!... వెంటనే తను యువకుడుగా, లూసీతో గడిపిన నాటి తనమూర్తిని జ్ఞాపకం చేసుకున్నాడు. తను ప్రేమించబడి, పూజింపబడే రోజుల్లోని ఆ మూర్తి - నిజంగా ఎంత రూపంతో ఉండేవాడు...ఒక విచిత్ర వస్తువును చూద్దామనే కుతూహలంతో భూతద్దాన్ని ఉపయోగించినట్టు - లాంతరు ఇంకా ముందుకు జరిపి - తను కూడా అద్దానికి దగ్గరిగా జరిగాడు. తనలో ఎంత ఘోరమైన మార్పు! కళ్ళల్లో ఆ మెరుపూ, ఆ చిలిపితనమూ లేవు. ముఖంలోని వర్చస్సు కూడా ఎంతో తగ్గిపోయింది. ఇంతకు ముందెప్పుడూ తను గమనించని ఇలాటి భయంకరమైన మార్పులు కనిపించినయ్.

అతను నిరుత్సాహంతో, నిరాశ ఆవరించిన మనస్సుతో - తన ప్రతిబింబం తనలో కలిగించిన విచారంతో, బాధతో, బరువుగా కుర్చీలో కూర్చొని కుంగిపోయి గొణిగాడు; 'జార్జ్! ఇక నీ మంచి రోజులన్నీ ఐ పోయినయ్!"

*(అనువాదం : శేషుబాబు)*